క్లుప్తంగా

స్నేహమేరా జీవితం..



స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం అన్నాడో సినీకవి. ఒకేమాట, ఒకేబాటగా నడిచేవారే స్నేహితులు. అటువంటి స్నేహితుల కోసం కూడా ఓ రోజు ఉంది. ఆగస్టు మొదటి ఆదివారం ప్రపంచవ్యాప్తంగా స్నేహితుల దినోత్సవం జరుపుకుంటారు. ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ రాఖీలు కట్టుకుని శుభాకాంక్షలు తెలియజేసుకుంటారు. జిల్లా కేంద్రంలోని పలు దుకాణాలు ఫ్రెండ్‌షిప్ రాఖీల కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల తనిఖీ



చిన్నారితో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం అర్బన్: పట్టణంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలను ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యా సంబంధిత విషయాలతో పాటు విద్యార్థుల ఆహార, ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీశారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

రాములోరి సేవలో తిరుపాల్‌రెడ్డి



తిరుపాల్‌రెడ్డికి పూర్ణకుంభంతో ఆహ్వానం పలుకుతున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానాన్ని రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రభుత్వ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి శనివారం సందర్శించారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు దేవస్థాన అర్చకులు పూర్ణకుంభంతో శాస్త్రోక్తంగా ఆహ్వానం పలికి, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఏఓ పూర్ణిమ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన గిరిజన వర్సిటీ విద్యార్థుల 'ఫ్లాష్ మాబ్'



'ఫ్లాష్ మాబ్'లో భాగంగా డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

విజయనగరం అర్బన్: కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ విద్యార్థులు పట్టణంలోని శనివారం చేపట్టిన 'ఫ్లాష్ మాబ్' డాన్స్‌షో ఆకట్టుకుంది. తొలుత కలెక్టరేట్ ప్రాంగణంలో ఇన్‌చార్జి కలెక్టర్ మయూర్ అశోక్ డ్యాన్స్‌షోను శనివారం ప్రారంభించారు. గిరిజన వర్సిటీ ఐదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్, కోట, అంబేడ్కర్ కూడలి ప్రాంతాల్లో విద్యార్థులు ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. నిత్యం రద్దీగా ఉండే ఆయా ప్రాంతాల్లోని రోడ్లపై వర్సిటీ విద్యార్థుల డ్యాన్స్‌షోను స్థానికులు ఆసక్తిగా తిలకించారు. సందేశాత్మక, జానపద గీతాలకు లయబద్ధంగా వేసిన స్టెప్పులు, థింసా నృత్య ప్రదర్శన చూపరులను అలరించాయి.

లక్ష్యాలను చేరుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సెంచూరియన్ వీసీ మహంతి

నెల్లిమర్ల రూరల్: విద్యార్థులు కష్టపడి చదివి, అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని సెంచూరియన్ వీసీ ప్రొఫెసర్ పీకే మహంతి సూచించారు. మండలంలో టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ క్యాంపస్ ఇంటర్వ్యూల్లోనే కొలువులు సంపాదించే దిశగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ సన్నీ డియోల్ పాల్గొన్నారు.

త్వరలో బీఎస్ఎన్ఎల్ సంస్థతో ఒప్పందం

త్వరలో బీఎస్ఎన్ఎల్ సంస్థతో సెంచూరియన్ ఎంఓయూ కుదుర్చుకోనుందని వర్సిటీ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు తెలిపారు. శనివారం ఆ సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ సత్యప్రసాద్‌ను కలిసి ఎంఓయూ అంశంపై చర్చించారు.

ఆరోగ్యకరమైన పంటల సాగే లక్ష్యం

డెంకాడ: ఆరోగ్యకరమైన పంటల సాగే ప్రభుత్వ లక్ష్యమని మండల వ్యవసాయాధికారి పి. నిర్మల అన్నారు. మండలంలోని సింగవరంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రసాయన ఎరువుల వినియోగంతో పంట, నేల, పర్యావరణం కలుషితమవుతాయన్నారు.

ప్రజల వద్దకే పాలన..

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు
- రెండు గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం'
- హాజరైన ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు



నెల్లిమర్ల రూరల్: కుదిపిలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, తదితరులు



విజయనగరం: 11వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న నగర మేయర్ విజయలక్ష్మి, తదితరులు



విజయనగరం: 50వ డివిజన్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

నెల్లిమర్ల రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రజల వద్దకే పాలన, సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని కుదిపి, నీలంరాజుపేట గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబుతో కలిసి ఇంటింటా పర్యటించి సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఒక్కో కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరిస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులందరికీ నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందజేస్తూనే...మరోవైపు అభివృద్ధి కొనసాగిస్తున్నామన్నారు. గ్రామాల్లో సమస్యలు పరిష్కరించేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని, గుర్తించిన సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేస్తున్నామని చెప్పారు.

అన్నివర్గాల ప్రజల అభ్యున్నతే లక్ష్యం : ఎమ్మెల్సీ

ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోను పవిత్రంగా భావించి, ప్రజలకు ఇచ్చిన హామీలను శత శాతం నెరవేర్చారని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, డీసీసీబీ వైస్ చైర్మన్ చనమల్లు వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, సర్పంచ్ రాయి పైడమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు మజ్జి త్రివేణి, టూరిజం బోర్డు డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ కారుకొండ కృష్ణ, తహసీల్దార్ శైలజ, ఎంపీడీఓ గిరిబాల, గ్రామపెద్దలు ఆనంద్, విభీషణరావు పాల్గొన్నారు.

గణనీయమైన అభివృద్ధి

విజయనగరం: ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ, అభివృద్ధి పనులు చేపడుతూ నాలుగేళ్లలో విజయనగరాన్ని గణనీయంగా అభివృద్ధి చేసినట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 49, 50 డివిజన్‌లలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా రూ.41 లక్షలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పలువురు లబ్ధిదారులకు రూ.200కే కుళాయి కనెక్షన్లు మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రభుత్వ పాలనపై ఆరా తీశారు. అనంతరం కాలువలు, రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్‌చార్జి కంటుభక్త తవిటిరాజు, స్థానిక కార్పొరేటర్ పట్టా ఆదిలక్ష్మి మాట్లాడుతూ, శంకుస్థాపన మాస మహోత్సవాలలో భాగంగా రూ.41 లక్షలతో వివిధ అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శంకుస్థాపనలు చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, నడిపిల్లి ఆదినారాయణ, కనుగుల రాజా, పీఏసీఎస్ అధ్యక్షుడు మధు, తదితరులు పాల్గొన్నారు.

11వ డివిజన్‌లో...

నగరంలోని 11వ డివిజన్ బెస్తా కాలనీలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, జోనల్ ఇన్‌చార్జ్ కోలగట్ల కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలను వివరిస్తూ బుక్‌లెట్లను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంపడాపు శ్రీనివాసరావు, నాయన మహేష్, అప్పారావు, మోహనరావు పాల్గొన్నారు.

39వ డివిజన్‌లో..

విజయనగరం: నగరంలోని 39వ డివిజన్‌లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జ్ కోలగట్ల కృష్ణారావు, తమ్మన్నశెట్టి, డాక్టర్ వీఎస్ ప్రసాద్ పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల తీరును వివరించారు. గోకపేట్ నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమంలో స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వ పథకాల పట్ల సానుకూల స్పందనను వెల్లడించారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్‌చార్జ్ డాక్టర్ వీఎస్ ప్రసాద్, కార్పొరేటర్ వింత ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, తమ డివిజన్ ప్రజలు సంక్షేమ పథకాల పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు.

బాక్సింగ్ హాల్‌కు ఆరు ఫ్యాన్ల వితరణ

- సిఎస్ఆర్ నిధుల కింద అందజేసిన యూనియన్ బ్యాంక్
- హర్షం వ్యక్తం చేసిన క్రీడాకారులు



సెట్విజ్ సీఈఓ రామ్‌గోపాల్‌కు ఫ్యాన్‌లు అందజేస్తున్న యూనియన్ బ్యాంక్ ప్రతినిధులు

విజయనగరం: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో గల బాక్సింగ్ హాల్‌కు యూనియన్ బ్యాంక్ సీపీఓ పి.బాలాజీ, మేనేజర్ వివేక్ ఆరు ఫ్యాన్‌లు శనివారం అందజేశారు. బాక్సింగ్ హాల్ ప్రాంగణంలో రూ.30 వేల విలువ చేసే ఫ్యాన్‌లు సీఎస్ఆర్ నిధుల కింద సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్, బాక్సింగ్ కోచ్ బి.ఈశ్వరరావులకు అందించారు. బాక్సింగ్ క్రీడాకారులకు అవసరమైన మరిన్ని సదుపాయాలు కల్పించేందుకు తమ వంతు సహాయ, సహకారాలు అందిస్తామని యూనియన్ బ్యాంక్ ప్రతినిధులు ఈ సందర్భంగా తెలిపారు. అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డోల మన్మథకుమార్, అసోసియేషన్ సభ్యుడు ఎస్‌ఈ రాజు, సీనియర్ క్రీడాకారులు వి.సంతోష్‌కుమార్, బి.జగదీష్, జి.అచ్యుతరావు, తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థంలో ప్రత్యేక పూజలు



హనుమాన్ చాలీసా పఠిస్తున్న మహిళలు

నెల్లిమర్ల రూరల్: రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన తర్వాత యాగశాలలో సుందరాకాండ హవనం, ఆదిత్య హృదయ హవనం, సుదర్శన అష్టక హవనం, తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు స్వామి సన్నిధిలో హనుమాన్ చాలీసా పఠనం చేశారు. అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, పవన్ పాల్గొన్నారు.

హస్తకళల ప్రదర్శనను వినియోగించుకోవాలి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



హస్తకళా ప్రదర్శనను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: విశాఖ హస్తకళల అభివృద్ధి సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని గురజాడ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన ఉత్పత్తుల ప్రదర్శనను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శనివారం ప్రారంభించారు. వివిధ రాష్ట్రాలు, ప్రాంతాలకు చెందిన వస్త్రాలు, హస్తకళ ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంచారు. విలువైన వస్తువులను కొనుగోలు చేసి తయారీదారులకు అండగా నిలవాలని కోలగట్ల ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో విశాఖ హస్తకళల అభివృద్ధి సొసైటీ అధ్యక్షుడు ఎస్‌డీ సలీం, డీపీఆర్ఓ డి. రమేష్ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి లలిత, తదితరులు పాల్గొన్నారు.

వలస బాలికల సమాచారంపై ప్రత్యేక డ్రైవ్



నాడు - నేడు పనుల ప్రగతిపై ప్రత్యేక అధికారికి వివరిస్తున్న ఎంఈఓ పాపునాయుడు

పూసపాటిరేగ: తీరప్రాంత గ్రామాల నుంచి బతుకుదెరువు కోసం వివిధ ప్రాంతాలకు వలస వెళ్లిన బాలికల సమాచారంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి బి. శాంతకుమారి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ పాపునాయుడు మాట్లాడుతూ, మండల పరిధిలో వివిధ గ్రామాల నుంచి వలస వెళ్లిన బాలికల సమాచారం తెలియాల్సి ఉందన్నారు. 9 సంవత్సరాల నుంచి 17 ఏళ్ల మధ్యనున్న పిల్లల సమాచారం తెలుసుకుంటున్నట్లు చెప్పారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు రాజేష్‌వర్మ, భాగ్యరేఖలు తెలిపారు. అలాగే సఖి కార్యక్రమాలు, నాడు – నేడు పనులపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి. రామారావు, తహసీల్దార్ ఇ.భాస్కరరావు, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల రక్షణ చట్టంలో మార్పులు చేయాలి



వైద్యారోగ్యశాఖ మంత్రి రజనికి వినతిపత్రం ఇస్తున్న జయచంద్రనాయుడు

విజయనగరం ఫోర్ట్: వైద్యులు, సిబ్బంది, ఆస్పత్రులకు రక్షణ కల్పిస్తూ దివంగత నేత వైఎస్సార్ తీసుకొచ్చిన వైద్యుల రక్షణ చట్టం (యాక్ట్ -11)లో మార్పులు తీసుకురావాలని కోరుతూ వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజనికి రాష్ట్ర ఐఎంఏ అధ్యక్షుడు (ఎలక్ట్) డాక్టర్ ముర్రు జయచంద్రనాయుడు శనివారం వినతిపత్రం ఇచ్చారు. ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను శనివారం ఆమె పరిశీలించారు. చట్టంలో మార్పులు చేయడంతో పాటు పోలీస్ మాన్యువల్‌లో చేర్చాలని కోరారు. కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, డాక్టర్ గౌరీశంకర్, డాక్టర్ మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకు కృషి

- రైల్వే పెన్షనర్ల సంఘ జోనల్ అధ్యక్షుడు ఆర్ఎస్ కుప్పూరావు



మాట్లాడుతున్న జోనల్ అధ్యక్షుడు ఆర్ఎస్.కుప్పూరావు

విజయనగరం టౌన్: రైల్వే పెన్షనర్ల సమస్యలు పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నామని పెన్షనర్ల సంక్షేమ సంఘ జోనల్ అధ్యక్షుడు ఆర్ఎస్.కుప్పూరావు స్పష్టం చేశారు. శనివారం స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలో ఉన్న సంఘ కార్యాలయంలో సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత నెలలో 15 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని నేషనల్ కో ఆర్డినేషన్ కమిటీ సభ్యుడు శివగోపాల్ మిశ్రా ఆధ్వర్యంలో ప్రధానికి అందించామన్నారు. అందరికీ ఆమోదయోగ్యంగా ఉన్న పాతపెన్షన్ విధానాన్ని మాత్రమే కొనసాగించాలని కోరినట్లు చెప్పారు. వెంటనే 8వ పే కమిషన్ పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షుడు విశ్వనాథం, పాట్రన్ ప్రెసిడెంట్ జగన్నాథం, జోనల్ కార్యదర్శి జగన్నాథరాజు, వైస్ ప్రెసిడెంట్ ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

'మిషన్ ఇంద్రధనస్సు' వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మండల ప్రత్యేక అధికారి శాంతకుమారి, తదితరులు

పూసపాటిరేగ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మిషన్ ఇంద్రధనస్సు, జాతీయ నులిపురుగుల నివారణ దినంనకు సంబంధించిన వాల్‌పోస్టర్లను మండల ప్రత్యేక అధికారి బి. శాంతకుమారితో పాటు మండల స్థాయి అధికారులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం ఈనెల 10వ తేదీ నుంచి 17 వరకు అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలల్లో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రాజేష్‌వర్మ, భాగ్యరేఖ, ఎంపీడీఓ రామారావు, తహసీల్దార్ భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

సమస్యలు పరిష్కరించండి

విజయనగరం: కార్పొరేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయడంతో పాటు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని... ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వ పథకాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రంగరాజు, జలగడుగుల కామేష్, పి.నారాయణరావు, డి.మూర్తి, ఎస్.శివ, తదితరులు పాల్గొన్నారు.

క్యాపిటల్ ఫండింగ్‌పై అవగాహన తప్పనిసరి

విజయనగరం అర్బన్: స్టార్టప్ కంపెనీలు పెట్టేముందు వెంచర్ క్యాపిటల్ ఫండింగ్‌పై అవగాహన తప్పనిసరని గ్రీన్నామ్స్ సహ వ్యవస్థాపకుడు వరుణ్ జామి అన్నారు. శనివారం స్థానిక గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 'వెంచర్ క్యాపిటల్ ఫండింగ్ – ఏంజెల్ ఇన్వెస్ట్‌మెంట్' అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య వక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, స్టార్టప్ కంపెనీని ప్రారంభించేందుకు అవసరమైన నిబంధనలు తెలుసుకోవాలన్నారు. అనంతరం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు ముఖ్య వక్తను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.వరూధిని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాల ఏర్పాటు అభినందనీయం



బీపీ చెక్ చేయించుకుంటున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

నెల్లిమర్ల రూరల్: ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. అనంతరం 128 మంది రోగులకు సిబ్బంది వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, నాగవంశం కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిల వాసు, నేతలు తుమ్మ నారాయణమూర్తి, పోలుబోతు నారాయణమూర్తి, నల్లి శ్రీను, ఎంఎం నాయుడు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

భోగాపురం: మండలంలోని అన్ని పంచాయతీ గ్రామాల్లో కన్వర్జెన్సీ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి సుధారాణి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న సచివాలయ, వెల్‌నెస్, రైతుభరోసా, అంగన్‌వాడీ భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుపతిస్వామికి సూచించారు. వ్యవసాయానికి సంబంధించి ఈ క్రాప్, ఈ కేవైసీ నమోదు ప్రక్రియ వేగవంతం చేయలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు, తహసీల్దార్ చింతాడ బంగార్రాజు, అధికారులు పాల్గొన్నారు.

నటరాజ్ కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే

విజయనగరం: నగరంలోని 31వ డివిజన్ పరిధి నటరాజ్ కాలనీలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శనివారం పర్యటించారు. మొదటగా వరసిద్ధి వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాలనీ పెద్దలతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ ఎన్ని లక్ష్మణరావు, జోనల్ ఇన్‌చార్జ్ కోలగట్ల కృష్ణారావులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కోలగట్ల మాట్లాడుతూ, నటరాజ్ కాలనీలో ఇప్పటికే రోడ్లు, డ్రైనేజ్, మంచినీటి కుళాయిలు, బోర్లు, తదితర సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించినట్లు చెప్పారు. గతంలో వేసిన రహదారులకు సంబంధించి ప్యాచ్ వర్కులను వెంటనే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు ఎం. మురళీధరరావు, పురుషోత్తం, చలపతిరావు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరిహారం

పూసపాటిరేగ: మండలంలోని పతివాడబర్రిపేట సముద్రతీరంలో ఇటీవల జరిగిన పడవ ప్రమాదంలో మృతి చెందిన వాసుపల్లి అప్పన్న కుటుంబానికి 10 లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరైనట్లు మత్స్యశాఖ అధికారి హేమంత్ తెలిపారు. ముందుగా 10 వేల రుపాయలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో మరికొద్ది రోజుల్లో పది లక్షల రూపాయలు మంజూరవుతాయన్నారు. కార్యక్రమంలో పతివాడబర్రిపేట సాగర్‌మిత్ర లేపాక్షి, సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక సదస్సులు

డొండపర్తి: ఈపీడీసీఎల్ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు సర్కిళ్లలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సదస్సులు నిర్వహించనున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్‌పర్సన్, విశ్రాంత జడ్జి బి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18న విజయనగరం సర్కిల్‌లో పార్వతీపురం సబ్ డివిజన్‌కు సంబంధించి ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, పేరుమార్పిడి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్ ఫార్మర్ల మార్పిడి, తదితర విద్యుత్ సంబంధిత సమస్యలపై వినియోగదారులు ఫిర్యాదులు చేయవచ్చని చెప్పారు. అలాగే విశాఖపట్నం సీతమ్మధారలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉన్న సీజీఆర్ఎఫ్ కార్యాలయానికి లిఖిత పూర్వకంగా కూడా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఈ సదస్సుల్లో సీజీఆర్ఎఫ్ కమిటీ సభ్యులు ఎస్.హరిబాబు, డాక్టర్ రాయసం సురేంద్రకుమార్ పాల్గొంటారని తెలిపారు.

చెడు స్నేహాలకు దూరం

– బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి

నెల్లిమర్ల రూరల్: విద్యార్థులు చెడు స్నేహాలకు దూరంగా ఉండి లక్ష్య సాధన వైపు పయనించాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. మండలంలోని మొయిద ఉన్నత పాఠశాలతో పాటు స్థానిక బీసీ బాలుర వసతిగృహాన్ని శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొంతమంది యువత విద్యార్థులను మభ్యపెట్టి అసాంఘిక కార్యక్రమాలకు ఉపయోగించుకుంటున్నట్లు కమిషన్ దృష్టికి వచ్చిందన్నారు. అటువంటివి రుజువైతే కఠిన చర్యలు తప్పవన్నారు. విద్యార్థి దశలో స్మార్ట్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు

భోగాపురం: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి సుధారాణి అన్నారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా మండలంలోని పోలిపల్లి పంచాయతీ జగనన్న కాలనీలో లబ్ధిదారులు చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను శనివారం ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రోతు వెంకటరమణ, ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు, హౌసింగ్ ఏఈ కొల్లి రాజేష్, ఏపీఓ అదిబాబు, ఏపీఎం రమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యావిధానంతో ముప్పు

నెల్లిమర్ల రూరల్: నూతన జాతీయ విద్యా విధానంతో ప్రభుత్వ విద్యకు ముప్పు వాటిల్లుతుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు సుధారాణి అన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జరుగుతున్న సైకిల్ యాత్ర శనివారం పట్టణానికి చేరుకోగా...ర్యాలీకి సీఐటీయూ అనుబంధ ప్రజా సంఘాలు స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో నేతలు రామ్మోహన్, వెంకటేష్, కిల్లంపల్లి రామారావు పాల్గొన్నారు.

ముర్రుపాలతో రోగ నిరోధక శక్తి

విజయనగరం ఫోర్ట్: తల్లి పాలలో రోగ నిరోధకశక్తి అధికంగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి. అనురాధ తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ, పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు రోహిణి, తిరుమల దీప, రామకృష్ణ పాల్గొన్నారు.